సాక్షి సిద్దిపేట

ఆదివారం : 18 : జూన్ : 2023



నాన్నే మా హీరో

నాన్న ప్రోద్బలంతోనే ఈ స్థాయికి చేరామని జిల్లా స్థాయి అధికారులు అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా 'సాక్షి'తో వారి మనోభావాలను పంచుకున్నారు. 8లో..



పల్లెల్లో వైద్య సేవలేవి?

మారుమూల గ్రామాల్లో పేదప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందడంలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. 9లో..

రేపు అర్బన్‌పార్కులో ఉచిత ప్రవేశం

గజ్వేల్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గజ్వేల్‌లోని అర్బన్‌పార్కులో ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 19న హరిత మహోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ పరిధి సంగాపూర్ రోడ్డులో కల్పకవనం అర్బన్‌పార్కులోకి ఉచిత ప్రవేశం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా రుతుస్రావ సంబంధ అలవాట్లు మార్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. శనివారం మండలంలోని మల్లారం, మేడిపల్లి గ్రామాల్లో మహిళలకు రుతుప్రేమపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం, డబ్బు, పర్యావరణ పరిరక్షణ, సౌకర్యం అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రుతుప్రేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కెమికల్స్ ప్యాడ్స్‌తో అనారోగ్యంతో పాటు పర్యావరణానికి కూడా ప్రమాదమేనన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీ దేవి, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, డాక్టర్ శాంతి, సర్పంచ్‌లు జ్యోతి, సరిత, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, ఏపీఎం మహిపాల్, మహిళలు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మున్నూరుకాపు కులస్తుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. శనివారం మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడెం రంజిత ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఎస్.కె.ఆరీఫాకు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది కాపులున్నారని, ఆర్థికంగా వెనుబడిన వారికి చేయూత అందించేందుకు రూ.5వేల కోట్లతో నిధి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం చేర్యాల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి చంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం, సంఘ ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

23న బహిరంగ వేలం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో వివిధ అమ్మకాలకు లైసెన్స్ కోసం ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బాలాజీ తెలిపారు. కొబ్బరి కాయలు అమ్మకం, మొక్కుబడి వస్త్రములు, బియ్యం, పసుపు, తలనీలాలు పోగు, కోర మీసాలు అమ్మకం, సెల్‌ఫోన్, పాదరక్షలు భద్రపరుచుకునే హక్కు, టాయిలేట్ బ్లాకుల నిర్వహణ, రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఒడిబియ్యం, కొబ్బరి ముక్కలు పోగు, పూజా సామగ్రి అమ్మకం తదితర లైసెన్స్‌ల కోసం టెండర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు నిర్ణీత దరవాత్తు సొమ్మును జాతీయ బ్యాంకులో ఆలయ కార్యనిర్వహణాధికారి పేరిట చెల్లుబాటు అయ్యేలా డీడీ తీసి 23వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 1గంట లోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు.

బీడీ కార్మికులను ఇబ్బందులు పెట్టొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

దుబ్బాక: దేశాయి బీడీ కంపెనీ వారు పితార కంపెనీ ఉత్పత్తులను కొనాలని బీడి కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని హిందూ మజ్దూర్ సభ జాతీయ కార్యదర్శి సుదర్శన్ రావు సర్దే, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ అన్నారు. బీడి కార్మికులను ఇబ్బందికి గురి చేస్తున్న దేశాయి బీడీ కంపెనీల పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలంటూ.. శనివారం వేయి మంది కార్మికులతో కలసిఇ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సలీం మియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు మధు, కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు నాంపల్లి, శేఖర్, అమర్‌నాథ్, తదితరులున్నారు.

ఇక బేఫికర్

సిద్దిపేట జీజీహెచ్‌కు క్రిటికల్ కేర్ యూనిట్

- రూ.23.75 కోట్లతో 50 పడకలు
- ఇక్కడే అత్యవసర వైద్య సేవలు



సాక్షి, సిద్దిపేట: వైద్య సేవల్లో మరో అడుగు ముందుకు పడనుంది. గతంలో ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అత్యవసర చికిత్స వెంటిలేటర్, ఐసీయూ సౌకర్యం కోసం హైదరాబాద్ గాంధీ, నిమ్స్‌కు పంపేవారు. కాగా సిద్దిపేట జీజీహెచ్‌లో ఇక నుంచి అత్యవసర సమయంలో చికిత్స అందించే క్రిటికల్ కేర్ యూనిట్ త్వరలో అందుబాటులోకి రానుంది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో రూ.23.75కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరైంది.

జిల్లా వ్యాప్తంగా..

- జీజీహెచ్‌లో ప్రస్తుతం 450 పడకలు ఉండగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నారు.
- త్వరలో మెడికల్ కళాశాల వద్ద నిర్మిస్తున్న భవనంలోకి మారితే 900 పడకలు అందుబాటులోకి రానున్నాయి.
- జిల్లాలో రెండు జాతీయ రహదారులు, ఒక రాష్ట్ర రహదారి ఉంది.
- మెదక్-సిద్దిపేట-ఎల్కతుర్తి, జనగామ-దుద్దెడ జాతీయ రహదారులుండగా, రాష్ట్రీయ రహదారి రాజీవ్ రహదారిలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతుంటాయి.
- రాత్రి సమయంలో గుండెపోటు, పక్షవాతం, పాముకాటు, ఇతర ప్రమాదాల జరిగినప్పుడు అత్యవసర సేవలు అవసరమవుతాయి.
- ఆస్పత్రికి వెళ్లిన సమయంలో స్పెషలైజేషన్ వైద్యుడు, వైద్య పరికరాలు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చేది.
- తాజాగా మంజూరైన క్రిటికల్ కేర్ యూనిట్‌తో ఆ ఇబ్బందులు తప్పనున్నాయి.
- జనవరి 2023 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 196 రోడ్డు ప్రమాదాలు జరగగా 102 మంది చనిపోగా, 215 మంది గాయాలపాలయ్యారు.
- రోడ్డు ప్రమాదాల్లో గాయపడిని వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృత్యువాత పడిన సందర్భాలున్నాయి.

ఆధునిక వైద్య సదుపాయాలు

- కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ 50 బెడ్‌లతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- ఎమర్జెన్సీ ఏరియా, ఐసీయూ, ఐసోలేషన్ వార్డ్, ఆపరేషన్ థియేటర్, లేబర్ డెలివరీ రికవరీ రూమ్స్ ఉంటాయి.
- వీటికి సహాయంగా ఇమేజింగ్ ఫెసిలిటీ(ఎక్స్‌రే, సీటీ స్కాన్ వంటివి), డైట్ సర్వీస్, మెకనైజ్డ్ లాండ్రీ సర్వీసులు ఉంటాయి.
- ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్స్, ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ కూడా అందుబాటులో ఉంటుంది.
- ఇలా అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేందుకు 24గంటలు నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉండనున్నారు.

> **మెరుగైన సేవలు అందించేందుకే..**
>
> 
>
> అత్యవసర సమయంలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో క్రిటికల్ కేర్ మంజూరు చేశాం. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 50 పడకలతో త్వరలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రజల ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటాం.
>
> – మంత్రి హరీశ్‌రావు

ప్రజా సంక్షేమమే ధ్యేయం



హాజరైన ప్రజలు

- నెలాఖరులో రైతుబంధు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బెజ్జంకిలో శనివారం సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. వేసవిలో నీటికోసం బిందెలతో పొలాల వద్దకు వెళ్లే కాలం నుంచి ఇంటికే నీళ్లు వస్తున్నాయంటే సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన భగీరథ పథకమేనన్నారు. వృద్ధులకు రూ.2,116ల పింఛన్ అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నెలాఖరున రైతుబంధు ఖాతాల్లో జమచేస్తామని, బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. గతంలో మండలానికి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని, గన్నేరువరం మండలానికి పీహెచ్‌సీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ పాటలు పాడుతున్న రసమయి బాలకిషన్‌కు ఆంధ్రా పాలకులు మెమోలు జారీ చేసి వేతనం నిలిపివేసినా ఉద్యమం కోసం ఉద్యోగాన్ని వదులుకున్నారని గుర్తుచేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధే తన పనులకు ప్రామాణికమన్నారు. అనంతరం గుగ్గిల్లలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, ఎంపీడీఓ రాము, తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు, సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, ఎంపీటీసీ గుబిరె శారద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం

- ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ రాష్ట్ర ప్రోగ్రాం హెడ్ బాగిష్ మిశ్రా

గజ్వేల్‌రూరల్: పశువులకు మెరుగైన వైద్య సేవలందించడం లక్ష్యంగా పశు సంచార వాహన(1962) సిబ్బంది కృషి చేయాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ రాష్ట్ర ప్రోగ్రాం హెడ్ బాగిష్ మిశ్రా అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో 1962 సంచార పశువైద్యశాల వాహనాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది పరస్పరం సహకరించుకొని మెరుగైన పశువైద్యం అందించాలని, ప్రతీ గ్రామానికి పశుసంచార వాహన వైద్యసేవలు అందాలన్నారు. పశువుల యజమానుల కాల్స్‌కు స్పందించాని ఆదేశించారు. అనంతరం వాహనంలోని మందులు, పరికరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సలీం, చక్రపాణి, డాక్టర్ మౌనిక, పారామెన్ మానస, పైలెట్ కన్నారెడ్డి, హెల్పర్ మహేందర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బాగిష్ మిశ్రా



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కరువుకు శాశ్వత సెలవు

- ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు
- పాములపర్తిలో 35 ఇళ్లు ప్రారంభం



ఇంటి పత్రం అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ కృషితో కరువుకు శాశ్వత సెలవు దొరకిందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో 48 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వర్షాల కోసం కప్పతల్లి, వరుణ దేవునికి పూజలు చేసేవారని అన్నారు. నేడు కాళేశ్వరంతో నాలుగు రాష్ట్రాలకు అన్నం పెట్టే ధాన్యరాశిగా మారిందన్నారు. సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వరకు రూ.66 కోట్లతో ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. సొంత జాగాలో ఇళ్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు మంజూరు చేస్తామని, జాగా లేనోళ్లకు ఇంటి స్థలం అందజేస్తామని తెలిపారు. మండలంలో 479 ఇళ్లు కట్టించామన్నాని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, వైఎస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, శారద, కాముని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ పాలనలో ప్రజా సంక్షేమం సాధ్యమైందని, గతుకుల గజ్వేల్ నేడు బతుకుల గజ్వేల్‌గా మారిందని ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండలంలోని పాముపపర్తి గ్రామంలో కావేరి భాస్కర్‌రావు చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన 35 ఇళ్లను శనివారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. వారికి ఇళ్ల పత్రాలను అందించి మాట్లాడారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వం రూ.5 లక్షల ఇవ్వగా, మరో రూ.11.50లక్షలు కావేరి భాస్కర్‌రావు చారిటబుల్ ఫౌండేషన్ అందించి ఇళ్లను పూర్తిచేయడం హర్షణీయమన్నారు. లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌కు, కావేరి భాస్కర్‌రావుకు రుణపడి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారులు తిన్నింటి రేవు తలవాలని, శివుడు నెత్తిమీద గంగను పెట్టుకున్నట్లు కేసీఆర్ పాములపర్తిమీద కొండపోచమ్మ రిజర్వాయర్‌ను పెట్టారని కొనియాడారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూగర్భజాలాలు పెరిగి భూమికి బరువయ్యేంత పంట పండుతుందన్నారు. గజ్వేల్‌లో మరో రూ.40 కోట్లతో 150 పడకల మతా, శిశు సంరక్షణ ఆస్పత్రిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. గృహలక్ష్మీ పథకం మహిళల పేరు మీదనే అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్లు శ్రీనివాస్, జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, గడా అధికారి ముత్యంరెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, నాచారం ఆలయ మాజీ చైర్మన్ హరిపంతులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణ యాదవ్, లింగారెడ్డి, మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుబేర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణకర్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు మేకల కనకయ్య, ఆత్మ డైరెక్టర్ సంతోషరెడ్డి, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తులు



చర్చి గురించి వివరిస్తున్న మతగురువు రిచర్డ్

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శనివారం దర్శించుకున్నారు. జడ్జికి ఈవో సార శ్రీనివాస్, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన జడ్జికి అర్చకులు తీర్థప్రసాదాలు అందించి జ్ఞాపికను అందించారు. ఆయన వెంట న్యామూర్తులు నవీన్‌రావ్, సంతోష్‌రెడ్డి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మిశారద, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉన్నారు.

మెదక్ చర్చి సందర్శన...

మెదక్‌జోన్: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చిని రాష్ట్ర హైకోర్టు చీఫ్‌జస్టిస్ ఉజ్జల్‌భుయాన్ శనివారం సందర్శించారు. కలెక్టర్ రాజర్షిషాలతో కలిసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువు రిచర్డ్ చర్చి కి సంబంధించిన విశిష్టతను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు పి.నవీన్‌రావు, సంతోష్‌రెడ్డి, మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీశారద పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థులకు ఆర్థిక సాయం



వైద్య విద్యార్థికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: మెడిసిన్ చదువుతున్న పేద విద్యార్థులకు సిద్దిపేట మెడికల్ అసోసియేషన్ తరఫున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రావు తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య చదువుతున్న 31 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున శనివారం స్కాలర్‌షిప్స్ చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పేద మెడికల్ విద్యార్థులకు తోడ్పాటునందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్కాలర్‌షిప్స్ పొందిన విద్యార్థులు మెటీరియల్స్, పుస్తకాలకు మాత్రమే దీనిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ డాక్టర్ రవికాంత్, డాక్టర్ గణేష్ వెనిశెట్టి, డాక్టర్ రాంమోహన్, డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండపోచమ్మ ఆలయ హుండీని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. అమ్మవారికి 80 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం రూ.9,74,474లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన ఆదాయం ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావ్యదర్గయ్య, ఆలయ సిబ్బంది రవికాంత్, వెంకట్‌రెడ్డి, కనకయ్య, చిన్నా, చందు, లక్ష్మణ్, సుధాకర్, హరి, అర్చకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పార్కింగ్ కష్టాలు

- నీడ సదుపాయం లేక ఇక్కట్లు
- ఎండలోనే నిలుపుతున్న వాహనాలు



కలెక్టరేట్ భవనం వద్ద ఎండలో వాహనాలు

సిద్దిపేటరూరల్: అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనం వద్ద సరైన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చేవారు వాహనాలు నిలిపేందుకు నీడ లేక ఎండలోనే పార్కింగ్ చేస్తున్నారు. షెడ్‌లను నిర్మించకపోవడంతో చెట్ల నీడ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్ ఆవరణంలో పార్కింగ్ చేసిన వాహనాలు వేడెక్కి పెట్రోల్ ఆవిరైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల కింద పార్కింగ్

కలెక్టరేట్‌కు పని నిమిత్తం వచ్చిన వారు కలెక్టరేట్ బయట ప్రాంగణంలో చెట్ల కింద తమ కార్లు, బైక్‌లను పార్కింగ్ చేసి వస్తున్నారు. కొంతమంది జిల్లా అధికారులు కూడా వారి వాహనాలను చెట్ల కిందే పార్కింగ్ చేసుకుంటున్నారు. మరోవైపు కలెక్టరేట్‌లో అధికారులను కలిసేందుకు వస్తున్న వారు తమ బైక్‌లను ప్రవేశ ద్వారం వద్ద ఎదురుగా పెట్టడంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా వికలాంగులు లోపలికి వచ్చేందుకు ఇక్కట్లు పడుతున్నారు.

షెడ్లను ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ వద్ద పార్కింగ్ స్థలం ఉన్నా.. షెడ్లు లేకపోవడంతో ప్రజలు, అధికారులు వాహనాలను చెట్ల కింద పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ నీడ కోసం షెడ్లను ఏర్పాటు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.



కలెక్టరేట్ ముఖద్వారం వద్ద అడ్డుగా పార్క్ చేసిన వాహనాలు



బయట చెట్టుకింద పార్క్ చేసిన వాహనాలు

క్లుప్తంగా

గడ్డివాములు, ఎద్దులబండి దగ్ధం


కాలిపోతున్న గడ్డివాములు

నారాయణఖేడ్: కొండాపూర్ పంచాయతీ పరిధిలోని శివార్‌సండ్ తండాలో శనివారం తెల్లవారుజాము జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివాములు, ఎద్దులబండి దగ్ధమయ్యాయి. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం వడిత్యాకిషన్ నాయక్ 280 గడ్డివాములను కొని ఇంటి సమీపంలోని ఖాళీస్థలంలో నిల్వ ఉంచాడు. తెల్లవారుజాము మంటలు ఎగిసిపడుతుండటాన్ని తండావాసులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చే సరికి గడ్డివాములు, ఎద్దులబండి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని లంబాడాహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌రాథోడ్ విజ్ఞప్తి చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

మెదక్ రూరల్: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన హవేళీఘణాపూర్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏసు(27) గ్రామశివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో మహిళ మృతదేహం

జహీరాబాద్ టౌన్: గుర్తుతెలియని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని బూచినెల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం శనివారం వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ దున్నుతున్న సమయంలో డ్రైవర్, మహిళ (50) మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నాన్నే మా హీరో

- బిడ్డలను గ్రాడ్యుయేట్స్ చేసిన టైలర్ అబ్దుల్లా
- ఏకైక కుమారుడిని సైన్యంలోకి పంపిన అడ్వొకేట్ వెంకట్‌రెడ్డి
- సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా ఏకేఖాన్ కుమారుడు ముజామ్మిల్ ఖాన్
- ఐపీఎస్ స్ఫూర్తితో ఐఏఎస్‌లోకి..

ఆయన ఓ సాధారణ టైలర్. టైలరింగ్ చేస్తూ తన ముగ్గురు కుమార్తెలను, కుమారుడిని గ్రాడ్యుయేట్స్‌ను చేశాడు. అందులో ఇద్దరు కుమార్తెలు జీవితంలో సెటిల్ కాగా, మరో కూతురు, కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. తాను ఇంటర్ చదివినా, తన సంతానాన్ని పట్టభద్రులను చేశాడు. ఆయనే అందోల్‌కు చెందిన షేక్ అబ్దుల్లా. అలాగే తన ఏకైక కుమారుడు సిద్ధార్థ్ రెడ్డిని ఆర్మీకి పంపారు. చిన్నతనం నుంచే కొడుకు అభిష్టాన్ని ప్రోత్సహించారు. అప్పుడు లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో చేరిన సిద్ధార్థ్ రెడ్డి ప్రస్తుతం మేజర్‌గా ఉన్నారు. ఆయనే సిద్ధార్థ్ తండ్రి వెంకట్‌రెడ్డి. నాన్న ప్రోద్బలంతోనే ఈ స్థాయికి చేరామని సిద్దిపేట అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, మేజర్ సిద్ధార్థ్ రెడ్డి చెబుతున్నారు. ఫాదర్స్ డే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనాలు..

అహర్నిశలు శ్రమించిన అబ్దుల్లా

జోగిపేట(అందోల్): దర్జీ (టైలరింగ్) పనిచేస్తూనే సమాజంలో తలెత్తుకొని తిరిగేలా తన బిడ్డలను ఉన్నత చదువులు కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి షేక్ అబ్దుల్లా. ఫాదర్స్ డే సందర్భంగా షేక్ అబ్దుల్లాపై ప్రత్యేక కథనం. అందోల్ మండలం పోసానిపేట గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్లా జోగిపేట పట్టణంలోని ఆర్‌ఎస్ టేలర్ దర్జీ. రోజూ స్వగ్రామం నుంచి 2 కిమీ కాలినడకనే టైలర్ షాప్‌కు చేరుకుంటారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు అసియా సుల్తానా, అస్మీ, ఆస్మా, షేక్ అహ్మద్ అనే కుమారుడు ఉన్నారు. నలుగురిని పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు చదివించారు. ఇందులో అస్మీ ఝరాసంఘం పాఠశాలలో, ఆస్మా రాయికోడ్ మండలం పిప్పడ్ పల్లి గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నది. అసియా సుల్తానా, షేక్ అహ్మద్‌లూ టీచర్ పరీక్షలకు రాశారు. షేక్ అహ్మద్ ప్రస్తుతం గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. టైలరింగ్‌పైనే కుటుంబం ఆధారపడి ఉన్నా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్నాడు. తన పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందని 'సాక్షి' ప్రశ్నించగా ।నేనే కేవలం ఇంటర్ వరకే చదువుకున్నా. నా పిల్లలను ఉన్నత చదువులు చదివించి సొసైటీలో శభాష్ అని పించుకోవాలన్నదే నా ఆశ. పిల్లలంతా ఉన్నత చదువులు చదివినందుకు గ్రామంలోనూ నాపై గ్రామస్తులకు ప్రత్యేక అభిమానం ఉంది అని' తెలిపారు.


జోగిపేటలో టైలరింగ్ పని చేస్తున్న షేక్ అబ్దుల్లా

చిన్ననాటి నుంచి ప్రోత్సాహం

జహీరాబాద్: ఒక్కగానొక్క కుమారుడు సిద్ధార్థ్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి ప్రోత్సాహంతో ఆర్మీలో మేజర్ స్థాయికి ఎదిగారు. అడ్వొకేట్ వెంకట్‌రెడ్డి కోహీర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామస్తుడు. కాగా ఆయన జహీరాబాద్‌లో స్థిరపడ్డారు. కుమారుడు సిద్ధార్థ్ రెడ్డిని చిన్నప్పటి నుంచి అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించారు. ప్రాథమిక విద్య జహిరాబాద్‌లో పూర్తి చేసుకున్నాడు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. దేశానికి సేవలందించాలనే ఉద్దేశంతో ఆర్మీలోకి చేరేందుకు ప్రోత్సహించాడు. 2011లో సర్వీసు సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బీ) సెలక్షన్ తర్వాత లెఫ్టినెంట్ అయ్యాడు. 2012లో డెహ్రాడూన్‌లో ఆర్మీ శిక్షణకు వెళ్లాడు. 2013లో కమిషన్ ఆఫీసర్‌గా, 2014లో కెప్టెన్‌గా నియమితులయ్యాడు. 2018లో మేజర్‌గా పదోన్నతి. మరో మూడేళ్ల అనంతరం లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొందనున్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్‌రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. దేశానికి సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. భోపాల్, జమ్మూకశ్మీర్, అమృత్‌సర్ రాష్ట్రాల్లోని దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం మేఘాలయలోని షిల్లాంగ్‌లో చైనా బోర్డర్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు వసంత-వెంకట్‌రెడ్డి ప్రోత్సహించడంతోనే ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు.


మేజర్ సిద్ధార్థ్‌రెడ్డితో తల్లిదండ్రులు వసంత, వెంకట్‌రెడ్డి

ఆయనలాగే ఉండాలని..

మా నాన్న స్ఫూర్తితోనే, నేను ఈ స్థాయికి చేరాను. మా నాన్నకు ఉద్యోగ విధుల నిమిత్తం 24/7 ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఫ్యామిలీ పై ప్రత్యేక దృష్టి పెట్టారు. పని ఒత్తిడిలో, కష్టకాలంలో ఉన్న సైతం అంత ఎఫెక్ట్ చూపించేవారు కాదు. రోజూ సాయంత్రం నాతో, అన్నయ్య, చెల్లితో చదువుల గుర్చి, మార్నింగ్ నుంచి ఈవినింగ్ వరకు ఏం చేశారని విషయాలు తెలుసుకునే వారు. ఆయన లాగే ఉండాలని ఉంది... ఆయన చేసిన దానిలో కొంతైన చేయాలని కోరిక ఉంది. నాకు ఏజ్ పెరుగుతున్న కొద్ది వెనక్కి చూస్తే ఇప్పుడు తెలుస్తోంది నాన్న మా కోసం ఎలా కష్ట పడ్డారు అని. నా సక్సెస్ వెనుక అమ్మానాన్న ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుంది.

ముజామ్మిల్ ఖాన్, సిద్దిపేట అదనపు కలెక్టర్ (రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ప్రభుత్వ సలహాదారుడు ఏకే ఖాన్ కుమారుడు)



యువకుడి అనుమానాస్పద మృతి

జిన్నారం (పటాన్‌చెరు): శరీరంపై గాయాలతో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన ఖాజీపల్లిలో శనివారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి, మృతుడి సోదరుడు ముత్తంగిల బాలు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ముత్తంగిల గోపి(25), తన భార్య వసుంధర, కూతురు దీక్షతో కలిసి ఉండేవాడు. 10 రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడగా కూతురితో సహా వసుంధర పుట్టింటికి చేరింది. దీంతో గోపి బొల్లారం వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న సోదరుడు బాలు ఇంట్లో తిని, పనికి వెళ్తుండేవాడు. రాత్రుళ్లు ఖాజీపల్లిలోని తన ప్లాట్‌కు వెళ్లేవాడు. రోజూలాగే ఈనెల 16న తిని వెళ్లాడు. శనివారం అతడు సోదరుడి ఇంటికి తిరిగిరాలేదు. బాలు పలుమార్లు ఫోన్ చేసి, గోపి ప్లాట్‌కు వెళ్లి చూడగా అతడు విగతజీవిగా కనిపించాడు. అక్కడ వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బాలు ఫిర్యాదు మేరకు సీఐ సురేందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


లింగం (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన బొల్లం లింగం (32) గతంలో రూ.2లక్షల డౌన్‌పేమెంట్ కట్టి ట్రాక్టర్ తీసుకున్నాడు.మిగతా వాయిదాలలో చెల్లించేందుకు ఒప్పుకున్నాడు. ఈఎంఐలు సరిగా కట్టకపోవడంతో ఫైనాన్స్ వారు ట్రాక్టర్ తీసుకెళ్లారు. ఆ తర్వాత పాల వ్యాపారం చేసి రూ.లక్ష, తనకున్న 20 గుంటలలో 3 బోర్లు వేసి రూ.2లక్షల వరకు నష్టపోయాడు. మొత్తంగా రూ.5లక్షలు అప్పులయ్యాయి. అప్పుల వారి వేధింపులకు తాళలేక ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. స్నేహితుడు, కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి బాధితుడిని తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

698 మంది అభ్యర్థుల రాక


సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్‌ఐ, కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగాలకు తుది రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలనలో నాల్గోరోజు 800 మంది అభ్యర్థులకు గాను 698 హాజరైనట్లు ఎస్పీ ఎం.రమణ కుమార్ తెలిపారు. అభ్యర్థులు తమ వెంట వెరిఫికేషన్ లెటర్, సంబంధిత ధ్రువపత్రాలన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జిరాక్స్ కాపీ తీసుకొని, కేటాయించిన రోజున సమయానికి పోలీస్ కల్యాణ మండపంలో హాజరు కావలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాలనా విభాగాధికారి కళ్యాణి, డీపీవో సిబ్బంది, ఆర్‌టీవో. ఐటీ సెల్ సిబ్బంది ఉన్నారు.

మతిస్థిమితం లేని వివాహితపై లైంగిక దాడి

- ఆరునెలల గర్భం దాల్చిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు
- పేరూరులో వెలుగుచూసిన ఘటన

మెదక్ రూరల్: మానసిక పరిస్థితి సరిగ్గా లేని వివాహితపై లైంగికదాడికి పాల్పడి గర్భవతిని చేశాడు ఓ ప్రబుద్ధుడు. ఈ ఉదంతం పేరూరులో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువతి (26)కి మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. కొంతకాలం క్రితం ఓ వ్యక్తితో వివాహం జరిపించగా భర్తతో విడిపోయి తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. అదే గ్రామా నికి చెందిన ఏసు అనే వ్యక్తి వివాహితకు మాయ మాటలు చెప్పి కొంతకాలంగా లైంగికదాడికి పాల్పతున్నాడు. ఈ క్రమంలో ఆమె ఆరు నెలల గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

గేదెల కోసం వెళ్లి గల్లంతు

టేక్మాల్ (మెదక్): గేదెల కోసం వెళ్లిన నదిలో వ్యక్తి గల్లంతైనా సంఘటన టేక్మాల్ మండలంలోని ఎలకుర్తిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కందిపల్లి నారాయణ(56) వ్యవసాయంపై జీవిస్తున్నాడు. రెండు రోజులు అతడి గేదెలు కనిపించకుండా పోగా శనివారం ఉదయం మంజీరనదిలో సేదదీరుతున్న విషయాన్ని గమనించాడు. వాటిని బయటికి తోలెందుకు నదిలోకి దిగి ప్రవాహానికి ప్రమాదవశాత్తు మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సింగూరు నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి నదిలో వెతికించినా అతడి ఆచూకీ లభించలేదు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు.


నారాయణ (ఫైల్‌ఫొటో)

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్

ఒడిశా యువతికి తీవ్రగాయాలు

తూప్రాన్: ఆర్టీసీ బస్సును కంటైనర్ లారీ ఢీకొన్న సంఘటనలో ప్రయాణికురాలికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై కరీంగూడ చౌరస్తా వద్ద శనివారం చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన సబితా మల్లిక(23) అనే యువతి కామారెడ్డిలోని ఓ హోటల్‌లో పని చేస్తోంది. హైదరాబాద్ నుంచి కామారెడ్డికి ఆర్మూర్ ఆర్టీసీ డిపో బస్సులో బయలుదేరింది. కరీంగూడ చౌరస్తా వద్దకు బస్సు చేరుకోగానే అతివేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సబితా కు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న సబితా మల్లిక

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

జోగిపేట(అందోల్): క్రీడల్లో క్రీడాస్ఫూర్తి ముఖ్యమని జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య అన్నారు. జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జోగిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. యువకుల్లో క్రీడానైపుణ్యతను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో జోగిపేటకు చెందిన కేకే -ఏ టీం విన్నర్‌గా గెలుపొందగా వారికి రూ.10వేల నగదు, కేకే -బీ టీం రన్నర్‌గా గుర్తించి రూ.5వేల నగదును నిర్వాహకులు అందజేశారు. క్రీడాకారులకు కప్‌లను చైర్మన్ మల్లయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు, చందు, బీఆర్‌ఎస్ నాయకులు సీహెచ్.వెంకటేశం, ఖాజాపాషా, బాబాలు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

ఇసుక లోడ్‌కెళ్లొచ్చే లోపు..

భార్య సహా రూ.2 లక్షల నగదు అదృశ్యం


రష్మి (ఫైల్‌ఫొటో)

పటాన్‌చెరు టౌన్: భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం భానూర్-బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం మెదక్‌కు చెందిన రాజేశ్వర్ పటాన్‌చెరు మండలం పాశమైలారం ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. గత నెల 23న ఒడిశా రాష్ట్రానికి చెందిన రష్మితో వివాహమైంది. శనివారం రాజేశ్వర్ ఇసుక లోడ్ ఖాళీ చేయించడానికి వెళ్లి తిరిగి ఉదయం 9.30 గంటలకు తన ఇంటికి రాగా, భార్య రష్మి అదృశ్యమైంది. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతోపాటు ఇంట్లోని రూ.2 లక్షల నగదు కనిపించడం లేదని రాజేశ్వర్ పేర్కొన్నాడు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో రాజేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లల్లో కారంచల్లి చైన్‌స్నాచింగ్

సంగారెడ్డి టౌన్: కళ్లల్లో కారంకొట్టి మహిళా మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీ చేసి ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పోతిరెడ్డిపల్లిలోని శిల్పా వెంచర్లో కిరాణా షాపు నిర్వహిస్తున్న సరిత(35) వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగాడు. సరిత తన పాపకు డ్రెస్ వేసి ఇస్తానని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన వ్యక్తి, ఆమెను అనుసరించి ఇంట్లోకి వెళ్లి కళ్లల్లో కారంపొడి చల్లి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును తెంపుకెళ్లాడు. అతడిని చూస్తే గుర్తుపడతానని సరిత చెబుతున్నది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొలం తడిపేందుకెళ్లి.. విద్యుదాఘాతంతో రైతు మృతి


బాలమల్లయ్య (ఫైల్)

కోహెడ రూరల్(హుస్నాబాద్): విద్యుత్‌షాక్‌తో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఆరేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు పకీడే బాలమల్లయ్య(58) శనివారం ఉదయం నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు స్టాటర్ వద్ద విద్యుత్‌షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య కనుకవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్టు


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

జహీరాబాద్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరిపై ఇనుపరాడ్డుతో దాడిచేసిన కేసులోని నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అల్లీపూర్ దర్గా సమీపంలో గల డెంటింగ్ షాపు యజమాని అజిమొద్దీన్ తన అక్క కుమారుడైన అహ్మద్‌ను, తాహెర్‌ను షాపులోకి పిలిపించి కొట్టించిన కేసులో నిందితులైన అజిమొద్దీన్, ఇమ్రాన్, అజీంలను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

కారు ఢీకొని కార్మికుడి దుర్మరణం

పటాన్‌చెరు పీఎస్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు టౌన్: ఓఆర్‌ఆర్‌పై లైన్ మార్కింగ్ చేస్తున్న కార్మికుడిని కారు ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెలరోజులుగా ఓఆర్‌ఆర్ రోడ్డుపై లైన్ మార్కింగ్ పనులు కొనసాగుతుండగా హజారిలాల్ అనే పేయింటర్ వద్ద రాజస్థాన్‌కు చెందిన సుభాష్ సైని(20) పనికి కుదిరాడు. శనివారం సుల్తాన్‌పూర్ ఓఆర్‌ఆర్ నుంచి ముత్తంగి మధ్య లైన్ మార్కింగ్ పనులను హజారిలాల్, సుభాష్ సైని సహా మరికొంతమంది చేస్తున్నారు. షామీర్‌పేట్ వైపు నుంచి పటాన్‌చెరు వెళుతున్న కారు, ఇంద్రేశం సమీపంలోకి వచ్చేసరికి సైన్ బోర్డు, రేడియం సేఫ్టీ కోన్‌లను దాటి సుభాష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓఆర్‌ఆర్ బ్రిడ్జిపై నుంచి పటాన్‌చెరు-దౌల్తాబాద్ వెళ్లే రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


సుభాష్ మృతదేహం

నర్సాపూర్ వెళుతుండగా ప్రమాదం

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ అదుపు తప్పి కింద పడిన సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. రామాయంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన వాసు దంపతులు బైక్‌పై నర్సాపూర్‌కు వెళ్తుండగా తూప్రాన్ - నర్సాపూర్ హైవే శివ్వంపేట గ్రామ శివారు రాజన్నవాగు వద్ద బైక్ అదుపు తప్పి దంపతులు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో భార్య తీవ్ర గాయాలయ్యాయి. భర్త స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు

రెండో రోజూ బస్సుల సీజ్



ఫిట్‌నెస్ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ పేరిట బస్సులను రవాణా శాఖాధికారులు తనిఖీలు చేస్తున్నారు. రెండోరోజైన శనివారం పటాన్‌చెరులో విద్యాసంస్థలకు చెందిన ఫిట్‌నెస్‌లేని రెండు బస్సులను ఎంవీఐ రాజామహ్మద్, ఏఎంవీఐ లావణ్య సిబ్బంది సీజ్ చేశారు.ఈ సందర్భంగా రాజా మహ్మద్ మాట్లాడుతూ, ఫిట్‌నెస్ లేని బస్సులను రహదారిపైకి తీసుకొస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తాచెదారాలకు నిప్పు

- ఐదు తాటిచెట్లు బుగ్గిపాలు
- కట్కూర్‌లో గడ్డివాము దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): తాటిచెట్లు, గడ్డివాము కాలిబూడిదైన సంఘటన అంతక్కపేట, కట్కూర్ గ్రామాల్లో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అంతక్కపేట ఊరచెరువు కట్టపై ఉన్న తాటిచెట్లకు నిప్పంటుకొని ఐదారు కాలిపోయాయి.పక్కనున్న వ్యవసాయ క్షేత్రంలో చెత్తాచెదారాలకు నిప్పు అంటించగా గాలిధాటికి తాటిచెట్లకు మంటలంటుకున్నాయి. అలాగే కట్కూర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన సుమారుగా 5 ఎకరాల గడ్డివాము బూడిదైంది. ఫైరింజన్ సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది.


అంతక్కపేటలో మంటలను ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

'ఆటో' పరేషాన్?

థియేటర్ వద్ద పార్కింగ్ చేసి మూడు నెలలు

తూప్రాన్: 3 నెలల క్రితం ఓ ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని రోడ్డు పక్కన వదిలేశారు. అప్పటి నుంచి అది అక్కడే ఉంది. దీని కోసం ఎవరూ రాకపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


వెంకటేశ్వర థియేటర్ సమీపాన వదిలివెళ్లిన ఆటో ఇదే